క్లుప్తంగా

సీఎం పీఆర్ఓగా సింగరేణి మండల వాసి



దూదిపాళ్ల విజయ్

కారేపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో పీఆర్ఓగా సింగరేణి మండల వాసి దూదిపాళ్ల విజయ్ నియమితులయ్యారు. మండలంలోని కొత్త కమలాపురానికి చెందిన విజయ్ 17ఏళ్లుగా ఢిల్లీలో ఓ ప్రధాన పత్రిక ప్రతినిధిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన సీఎం పీఆర్ఓగా నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేయగా మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

శరీరదానానికి అంగీకారం



అనుమతి పత్రం అందజేస్తున్న పద్మావతి

మధిర: మధిరకు చెందిన ఆర్టీసీ కండక్టర్ నామాల పద్మావతి తన మరణాంతరం ఖమ్మంలోని మమత మెడికల్ కళాశాలకు శరీర దానం చేయనున్నట్లు తెలిపారు. చనిపోయిన తర్వాత శరీరం మట్టిలో కలవడం కంటే వైద్యవిద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడాలని ఈ నిర్ణయం తీసుకుని బుధవారం అనుమతి పత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, జిల్లా శ్రీనివాసరావు, డాక్టర్ ఉదయ్, డాక్టర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సత్తుపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి మిత్రులు ఆర్థిక సాయం అందించిన సంఘటన సత్తుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. కందుకూరు గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి గోపాల్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని పరిస్థితి తెలుసుకున్న స్నేహితులు రూ.5,500లను సేకరించి తండ్రి వెంకటయ్యకు అందించారు. ఈ సందర్భంగా తేజా కళాశాల విద్యార్థులను, కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు అభినందించారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలిపోవడంతో గత కొన్ని రోజులుగా నీటి సరఫరా జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు పట్టించుకోకపోవడంతో సర్పంచ్ భాగం శ్రీనివాసరావు స్పందించి మరమ్మతులు చేయించాడు. దీంతో గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శివాలయంలో అన్నాభిషేకం

తల్లాడ: తల్లాడ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శివలింగానికి అన్నాభిషేకం నిర్వహించారు. తల్లాడ పరిసర గ్రామాల నుంచి భక్తులు అన్నం వండుకొని తీసుకొచ్చి అన్నాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో కుంకుమ పూజ, పాడ్యమి పూజ నిర్వహించారు. ఈ పూజల్లో మహిళలు పాల్గొన్నారు.

పాడ్యమి పూజలు

సత్తుపల్లిరూరల్: కార్తీకమాసం ముగింపు సందర్భంగా సత్తుపల్లి మండలం బేతుపల్లి శ్రీభువనేశ్వరి సమేత గౌతమేశ్వరస్వామి వారి శివ పంచమి క్షేత్రంలో బుధవారం భక్తులు పాడ్యమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాన్యాసక పూర్వక రుద్రాభిషేకం, చండీశ్వర, శ్రీకాలేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల హోమం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో బుధవారం అయ్యప్పస్వాములు శివాలయంలో హోమం నిర్వహించారు. ముందుగా జలబిందెలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అయ్యప్ప స్వామి నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏన్కూరు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ ఉమాకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నారుగూడెం 132కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ ఉండదని.. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

తల్లాడలోని.. కుర్నవల్లి ఫీడర్‌లో..

తల్లాడ: కుర్నవల్లి ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కుర్నవల్లి సెక్షన్ విద్యుత్ ఏఈ సుందర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుర్నవల్లి సబ్ స్టేషన్ పరిధిలోని కుర్నవల్లి, ముద్దునూరు, కలకొడిమ, రంగాపురం, కేశ్వాపురం, పుణ్యపురం, బస్వాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అభివృద్ధి ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న వ్యాపారి కోనా జనార్దన్ రావు

- పట్టణాభివృద్ధిపై అఖిలపక్ష నాయకుల సమావేశం
- పార్టీలకతీతంగా అభిప్రాయాలు వెల్లడించిన నాయకులు
- సమగ్ర నివేదికను సిద్ధం చేసి డిప్యూటీ సీఎంకు ప్రతిపాదనలు

మధిర: గతంలో మధిర ఎమ్మెల్యేగా వివిధ పార్టీల నుంచి గెలుపొందిన వారు రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలో లేకపోవడంతో నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో నిధులు మంజూరయ్యేవి కావు. దీంతో నియోజకవర్గ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండేది. ఇటీవల ఎన్నికల్లో మల్లు భట్టి విక్రమార్క గెలవడం, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి రావడం, భట్టికి డిప్యూటీ సీఎం పదవి దక్కడంతో మధిర దశ దిశ మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే, రాష్ట్రమంతా అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు మంజూరు చేసే ఆర్థిక శాఖ భట్టికి దక్కడం విశేషం.

అభివృద్ధికి ప్రత్యేక నిధులు..

2009 నుంచి 2014 వరకు ప్రభుత్వ చీఫ్ విప్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనిచేసిన భట్టి నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,800 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో కాచవరం, గౌరవరం, తొండల గోపవరం, వెంకటాపురం, బయ్యారం, అల్లినగరం వంటి గ్రామాలకు రహదారులు నిర్మించారు. జాలిముడి ప్రాజెక్టుతో పాటు కట్టలేరు, మున్నేరు నదుల నుంచి తాగు నీరు, సాగునీరు అందించే చర్యలు చేపట్టారు. ఆ తర్వాత అధికారం కోల్పోవడంతో కొన్ని అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగా, అన్ని పార్టీల నాయకులు మధిర అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వాలని భట్టి కోరగా.. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ, బీజేపీ, సీపీఎం, సీపీఐ నాయకులతో పాటు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొని సూచనలు చేశారు. ఈ సూచనలతో భట్టికి నివేదిక ఇవ్వాలని తీర్మానించారు.

సమస్యల్లో కొన్ని...

- మధిర మున్సిపాలిటీలో రోడ్ల విస్తరణ, కల్వర్టులు, అండర్ డ్రెయినేజీ నిర్మాణం
- మధిర నుంచి మడుపల్లి వరకు డబుల్ రోడ్డు, వైరా నదిపై కాజ్‌వే నిర్మాణం
- మడుపల్లిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో లెదర్ పార్క్ పరిశ్రమ ఏర్పాటు
- మున్సిపాలిటీలో విలీన గ్రామాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టడం
- ఇంటింటికి తాగునీరు సరఫరా
- పట్టణంలో రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా రింగ్, వాటర్ ఫౌంటెన్ నిర్మాణం
- మధిర పట్టణం చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మాణం
- ఎడ్యుకేషన్ హబ్, టెంపుల్ సిటీ, పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశం
- చిరు వ్యాపారులకు ప్రత్యేక భవన సదుపాయం
- రైల్వే అండర్ బ్రిడ్జి విస్తరణ
- మధిరలో కళాభవన్ నిర్మాణం
- శ్మశాన వాటికల అభివృద్ధి
- అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాల ఏర్పాటు
- వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాల కేటాయింపుతో పాటు ట్రాఫిక్ సమస్య నివారణ
- అన్ని ప్రభుత్వ శాఖలకు భవనాల నిర్మాణం
- అరులైన వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు
- మున్సిపాలిలో ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయడం

అన్ని సమస్యలకు పరిష్కారం..



రాష్ట్రస్థాయిలో ప్రాముఖ్యత కలిగిన పదవులను చేపట్టిన మల్లు భట్టి విక్రమార్క అన్ని సమస్యలను పరిష్కరిస్తారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తారు. నిధుల వరద పారుతుంది.

– మిర్యాల రమణ గుప్తా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు

నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం..



అధికార పార్టీ చేపట్టే అభివృద్ధి పనులకు, ప్రజా సమస్యల పరిష్కారానికి మా పార్టీ మద్దతు ఉంటుంది. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం. మధిర మున్సిపాలిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి.

– కనుమూరు వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు

అండర్ డ్రెయినేజీ నిర్మించాలి..



మధిర పట్టణంలో ముఖ్యంగా అండర్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి. రోడ్ల విస్తరణతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. సీసీ రోడ్లు నిర్మాణం, శ్మశాన వాటికల అభివృద్ధి జరగాలి.

– డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి..



అర్హులైన వారికి ఇళ్లు, ఇళ్లస్థలాలు మంజూరు చేయాలి. అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చాలి. ట్రాఫిక్ సమస్యను తొలగించాలి. చిరు వ్యాపారులకు ప్రత్యేక భవన సదుపాయం కల్పించాలి.

– బెజవాడ రవిబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి

ప్రతిరోజూ చెత్త సేకరించాలి..



ప్రతిరోజు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాల ఏర్పాటు చేయాలి. మధిర పట్టణానికి అండర్ డ్రెయినేజీ వ్యవస్థ అత్యవసరం.

– చిలువేరు సాంబశివరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి

గొత్తికోయల సమస్యలు పరిష్కరించాలి



పెనుబల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి: మండలంలోని కేడబ్ల్యూ చౌడవరం శివారు అటవీ ప్రాంతంలో నివాసముంటున్న గొత్తికోయల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధికారులకు సూచించారు. మండల పర్యటనలో భాగంగా బుధవారం ఆమె కేడబ్ల్యూ చౌడవరంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. గుత్తికోయలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పలువురికి పాస్‌పుస్తకాలు అందని విషయాన్ని చెప్పగా, త్వరలో అందిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ స్నేహలత, డీఆర్ఓ రామకృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీఓ వాల్మీకి కిషోర్, డాక్టర్ కిరణ్‌కుమార్, సర్పంచ్ పొట్లపల్లి శంకర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌తో పాటు చీకటి రామారావు, మోరంపూడి బాబురావు, అలుగోజు చిన్నస్వామి, కరిముల్లా, మిట్టపల్లి కిరణ్‌కుమార్, పిల్లి నవజీవన్, రామిశెట్టి మనోహర్‌నాయుడు వంగా ఝాన్సీ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు చేపట్టండి..

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్: తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న రహదారి, కల్వర్టు పనులను వెంటనే చేపట్టాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధికారులను ఆదేశించారు. రామానగరం–గంగారం మధ్య చెరువు వరదకు కల్వర్టుతో పాటు రహదారికి గండిపడి కొట్టుకుపోయింది. ఈ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించిన ఎమ్మెల్యే మరమ్మతులపై సూచనలు చేశారు. అదే విధంగా కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి అమ్మమ్మ వేల్పుల సమాధానం అనారోగ్యంతో మృతి చెందగా.. ఆమె మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఐబీ ఏఈ వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బీ జేఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరారూరల్: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. మండలంలోని గన్నవరం గ్రామంలో బుధవారం వైరా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మేనిఫెస్టో ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను 100 రోజుల వ్యవధిలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. త్వరలో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500 బోనస్‌తో పంట కొనుగోలు వంటి పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం రాశులను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేగా తొలిసారి గన్నవరం గ్రామానికి వచ్చిన రాందాస్ నాయక్‌ను ప్రజాప్రతినిధులు, స్థానికులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ బీడీకే రత్నం, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ సౌజన్య, కాంగ్రెస్ మండల కన్వీనర్ వెంకటనర్సిరెడ్డి, సీఐ నునావత్ సాగర్, ఏడీఏ బాబురావు, ఏఓ పవన్‌కుమార్, సొసైటీ సీఈఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



ఉదయ్‌కిరణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: ఈ నెల 17 నుంచి ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి కరాటే పోటీలకు స్థానిక విశ్వశాంతి విద్యాలయానికి చెందిన 8వ తరగతి విద్యార్థి గుమ్మడిదల ఉదయ్‌కిరణ్ ఎంపికయ్యాడు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బాలుడిని సత్కరించారు. పాఠశాల యాజమాన్యం, రామిశెట్టి వెంకటరమణమూర్తి రూ.3వేలు ఆర్థిక సాయం అందించారు. ఇటీవల నల్గొండ ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీల్లో ఉదయ్‌కిరణ్ అండ్–14 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు నాగేశ్వరరావు, సత్యనారాయణ, శిక్షకుడు పిచ్చియ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ పిల్లలకు బుధవారం వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో పాక్షిక పక్షవాతం, ఇతర శారీరక అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తామని, దీంతో పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందన్నారు. పాక్షిక అంగవైకల్యం కలిగిన పిల్లలకు అవసరమైన సహాయ పరికరాలను అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన తపాలా ఉద్యోగుల నిరసన



కల్లూరులో ధర్నా చేస్తున్న తపాలా ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్/కల్లూరు: తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సత్తుపల్లి పోస్టాఫీస్ వద్ద గల శిబిరంలో, కల్లూరులో గ్రామీణ తపాలా ఉద్యోగులు అర్ధనగ్న నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్ సేవక్‌లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని కల్పించాలని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సీనియార్టీ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గ్రాట్యుటీ పెంచాలని, డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు ఉన్న అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమ్మెలో ఏఐజీడీఎస్‌యు బ్రాంచ్ కార్యదర్శి బి.కృష్ణప్రసాద్, ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్లు, వి.మహేష్, మౌనిక, రమ్య, ఎన్‌యుజీడీఎస్ బ్రాంచ్ సెక్రటరీ, బి.నర్సింహారావు, ఎస్‌డి జానీ, కోటమర్తి వెంకటేశ్వరరావు, ఖాజాబి, పాషా, ఐ.వెంకటేశ్వరరావు, సంజీవరావు, రామయ్య, జయరాజు, హైదరాబాద్ సర్కిల్ కార్యదర్శి బండి జయరాజు, ఏఐజీడీఎస్‌యూ(జేఏసీ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు పట్టాభిరామయ్య, యూనియన్ నాయకులు ఎస్‌కే మౌలాలి, ఏఐజీడీఎస్‌యూ జిల్లా సహాయక కార్యదర్శి ఉపాధ్యాయుల రమేష్, దేవరపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి



పత్తిని పరిశీలిస్తున్న సెక్రటరీ నరేష్‌కుమార్

కారేపల్లి: సీసీఐ కేంద్రాల్లోనే రైతులు పత్తి విక్రయించాలని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ నరేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తిని దళారులకు అమ్మి మోసపోవద్దని, ఇప్పటివరకు కారేపల్లి సీసీఐ కేంద్రం ద్వారా 663 మంది రైతుల నుంచి 15 వేల క్వింటాల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రవి, రంజిత్, లక్ష్మయ్య, మధు సిబ్బంది పాల్గొన్నారు.

రాళ్లవాగుపై చెక్‌డామ్ నిర్మాణానికి సర్వే

ఏన్కూరు: మండలంలోని నాచారం సమీపంలోని రాళ్లవాగుపై చెక్‌డామ్ నిర్మాణానికి సర్వే నిర్వహించినట్లు ఎంపీపీ అరెం వరలక్ష్మి తెలిపారు. గిరిజన తెగల కమిషన్ నోటీస్ ఇవ్వడంతో జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు స్పందించి ఆదేశాల జారీ చేయడంతో ఇరిగేషన్ అధికారులు బుధవారం చెక్‌డామ్ నిర్మాణానికి సర్వే నిర్వహించారు.

తొలిమెట్టుపై అవగాహన

మధిరరూరల్: విద్యార్థులకు ఉన్న పరిజ్ఞానాన్ని బట్టి ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్ కోరారు. బుధవారం మండలంలోని మాటూరు కాంప్లెక్స్ పరిధిలో మాటూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చెరుపల్లి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గత ఐదు సంవత్సరాలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన దీవి సాయి కృష్ణమాచార్యులను సన్మానించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ సంగు కృష్ణాంజనేయులు, కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తొలిమెట్టు రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

టాయిలెట్ల నిర్మాణాలు పూర్తి చేయండి



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాం

సత్తుపల్లిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మాణంలో ఉన్న టాయిలెట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాం ఆదేశించారు. బుధవారం మండలంలోని కిష్టాపురం, తుంబూరు, తాళ్లమడ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 14 మరుగుడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సబ్సిడీ విడుదల చేయాలి



ఉద్యానవన శాఖాధికారి అనసూయకు సమస్య వివరిస్తున్న రైతు సంఘం నాయకులు

కొణిజర్ల: పామాయిల్ తోటల్లో అంతర పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ తక్షణమే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉద్యానవన అధికారి అనసూయకు వినతిపత్రం అందించి.. వారి సమస్యలను వివరించారు. ఖమ్మం జిల్లాలో పదివేల ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నామని.. వారందరికీ సబ్సిడీ ఇవ్వాలని, కనీస మద్దతు ధర రూ.18 వేలు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని రమేష్, నాయకులు చలపతిరావు, నరసయ్య, నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన వేడుకలు

ఎర్రుపాలెం: మండలంలోని గుంటుపల్లిగోపవరం గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రంలో బుధవారం పలువురి చిన్నారులకు అన్నప్రాసన వేడుకలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్ మండడపు రాజేశ్వరితో పాటు పలవురు మహిళలు చిన్నారులకు అన్నప్రాసన చేసి దీవించారు. గర్భిణులు, బాలింతలు ప్రతిరోజు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

'విజయ'లో ముగిసిన వర్క్‌షాప్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రముఖ ఈటీవీ లైఫ్ మోటివేషనల్ స్పీకర్ చల్లా ప్రవీణ్‌కుమార్, జేసీఐ సర్టిఫైడ్ ట్రైనర్ జోహర్‌బాబు 'ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్'అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవడంలో ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందని పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఏఏ సందర్భాల్లో ఎలా మాట్లాడాలి అనే విషయాలను తెలుసుకున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ జి.జాన్‌బాబు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ఆయేషా తరుణమ్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాస్‌లు పంపిణీ

తల్లాడ: మండలంలోని నారాయణపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ప్లేట్లు, గ్లాస్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు లేవని ఉపాధ్యాయులు తెలపగా పంపిణీ చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి తెలిపారు. అనంతరం మిట్టపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి షుగర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి కర్నాటి లక్ష్మారెడ్డి, లయన్స్ క్లబ్ డీసీ మిట్టపల్లి నరసింహారావు, వేమిరెడ్డి నాగార్జున్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.